

చిత్తూరు ఎంపీ అభ్యర్థిగా దగ్గుమళ్ల



● ప్రసాద్‌రావు పేరు ప్రకటించిన టీడీపీ

చిత్తూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎంపీ అభ్యర్థిగా మాజీ ఐఆర్ఎస్ అధికారి దగ్గుమళ్ల ప్రసాద్‌రావును టీడీపీ అధిష్ఠానం ఖరారు చేసింది. బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గానికి చెందిన ఈయన కొన్నాళ్లుగా చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులతో కలిసి ప్రచారాల్లో పాల్గొంటున్నారు. ప్రసాద్‌రావును చిత్తూరు టీడీపీ ఎంపీ అభ్యర్థిగా ఖరారు చేయనున్నట్లు ఈనెల 7వ తేదీన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో శుక్రవారం విడుదల చేసిన అభ్యర్థుల మూడో జాబితాలో ఆయన పేరును టీడీపీ ప్రకటించింది. చిత్తూరు పార్లమెంటు పరిధిలో కుప్పం నియోజకవర్గం ఉండడం.. అక్కడ ప్రతిసారీ చంద్రబాబుకు అత్యధిక మెజార్టీ రావడం.. వంటి కారణాలతో ఇక్కడి నుంచి పోటీ టీడీపీ అభ్యర్థి కచ్చితంగా గెలుస్తూ వస్తున్నారు. 2019 ఎన్నికల్లో మాత్రం అప్పటి వేవ్ కారణంగా వైసీపీ అభ్యర్థి రెడ్డెప్ప చేతిలో శివప్రసాద్ ఓటమి చెందారు. ఆ తర్వాత అనారోగ్యంతో ఆయన మరణించారు. అప్పట్నుంచి చిత్తూరు ఎంపీ స్థానం ఎవరికి కేటాయిస్తారా అన్న ఆసక్తి శ్రేణుల్లో నెలకొంది. సినీ నటుడు సప్తగిరి ఎంపీ టికెట్ కోసం హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ ద్వారా ప్రయత్నాలు చేసినట్లు ప్రచారం జరిగింది. ఆ తర్వాత జీడీనెల్లూరు నియోజకవర్గానికి చెందిన మాజీ ఎస్పీ (కేంద్ర భద్రతా దళం) పీసీ స్వామి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరి ఎంపీ టికెట్ కోసం ప్రయత్నాలు చేశారు. చివరిగా మాజీ ఐఆర్ఎస్ అధికారి ప్రసాద్‌రావు తెరపైకి వచ్చారు. ఈయన ఐఆర్ఎస్ అధికారిగా 2019లో ముందస్తు పదవీ విరమణ పొంది తన కుమారుడు రాధే పేరుతో హైదరాబాదులో కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ స్థాపించారు. ముందుగా బాపట్ల ఎంపీ స్థానం కోసం ప్రయత్నించిన ఆయన.. అనంతరం టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశంతో చిత్తూరు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. పది రోజులుగా చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటించి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులతో కలిసి ప్రచారాల్లో పాల్గొంటున్నారు.

పూర్తి పేరు: దగ్గుమళ్ల ప్రసాద్‌రావు
పుట్టినతేదీ: 09.01.1962
తల్లిదండ్రులు: దివంగత సుశీలమ్మ, దివంగత లూకే
కుమారుడు: రాధే (ఎండీ, రాధే కన్‌స్ట్రక్షన్ కంపెనీ)
సొంతూరు: చింతగుంపల్లె గ్రామం, చిన్నగంజాం మండలం, బాపట్ల జిల్లా
బ్యాచ్‌లర్ ఇన్ జర్నలిజం: ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్
పీజీ ఇన్ ఆర్ట్స్ అండ్ పొలిటికల్ సైన్స్: సెంట్రల్ యూనివర్సిటీ, హైదరాబాద్
ఉద్యోగం: ఇన్‌కమ్ ట్యాక్స్ శాఖలో మాజీ జాయింట్ కమిషనర్ (ఐఆర్ఎస్ అధికారి). 2019లో ముందస్తు పదవీ విరమణ పొంది రాధే కన్‌స్ట్రక్షన్ కంపెనీ చైర్మన్‌గా ఉంటున్నారు.



జగనన్న పాలనలో

జగన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి అటకెక్కినా జిల్లా మూడు రంగాల్లో మాత్రం నెంబర్ వన్‌గా మారింది. ఎర్రచందనం స్మగ్లింగ్, గంజాయి దొంగరవాణా, దొంగసారా వ్యాపారం విచ్చలవిడిగా పెరిగాయి. తరచూ పట్టుబడుతున్న గంజాయిని చూస్తే జిల్లా గంజాయి వనంలా మారిపోయిందని అర్థం అవుతోంది. ఏకంగా ఎర్రచందనం స్మగ్లర్లనే ఎన్నికల్లో నిలబెడుతున్న జగన్‌రెడ్డి పాలన తీరును చూసిన జనం నోళ్లు నొక్కుకుంటున్నారు.
- చిత్తూరు

గంజాయి గుప్పుమంటోంది



● విపరీతంగా పెరిగిన వాడకం, విక్రయం

జిల్లాలో గంజాయి గుప్పుమంటోంది. ఎప్పుడూ లేని విధంగా కిలోల లెక్కన గంజాయి పట్టుబడుతుండగా పదుల సంఖ్యలో నిందితులు అరెస్టవుతున్నారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సరిహద్దులో చిత్తూరు జిల్లా కేంద్రం ఉంది. జిల్లా మీదుగానే ఇతర ప్రాంతాలకు గంజాయి రవాణా జరుగుతోంది. ఇతర రాష్ట్రాలకు వెళ్లడాన్ని అటుంచితే జిల్లాలోనే పెద్దఎత్తున వినియోగిస్తున్నారనే విషయం ఆందోళనకు గురిచేస్తోంది. చిత్తూరు, పలమనేరు, కుప్పం, పుంగనూరు వంటి పట్టణ ప్రాంతాల్లో సరఫరాతో పాటు వాడకం కూడా అధికంగా ఉంది. కుప్పం, గంగవరం, పెద్దపంజాణి, కుప్పం, రామకుప్పం, పలమనేరు, వి.కోట వంటి గ్రామీణ ప్రాంతాల్లో సాగు చేస్తున్నారనే విషయం అప్పుడప్పుడు పోలీసుల దాడుల్లో వెలుగులోకి వస్తోంది. ఆరు నెలల పాటు గంజాయిపై ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించగా 400 కిలోల గంజాయి, 45 మంది నిందితులను పట్టుకుని రిమాండ్‌కు తరలించారు.

విశాఖ నుంచి బెంగళూరుకు..

విశాఖపట్నం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో అధికంగా గంజాయి సాగు జరుగుతోందని, అక్కడ నుంచే చిత్తూరు మీదుగా బెంగళూరు, తమిళనాడుకు సరఫరా అవుతోంది. కూడా జిల్లా మీదుగా ఒడిసా సరిహద్దు ప్రాంతాల్లో సాగు చేస్తున్న గంజాయిని బెంగళూరు, చెన్నైకు తరలిస్తున్నారు.

చిత్తూరు, తిరుపతి కేంద్రాలుగా సరఫరా..

ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు యూనివర్సిటీలు, కాలేజీలు అధికంగా ఉన్న తిరుపతిలోనే గంజాయి వాడకం అధికంగా ఉందనేది ఒకప్పటి మాట. ఇప్పుడు అన్ని చోట్లకీ విస్తరించింది. జిల్లాలో చిత్తూరు, పలమనేరు, కుప్పం, పుంగనూరు, నగరివంటి ప్రాంతాల్లోని కాలేజీల విద్యార్థులనే లక్ష్యంగా ఎంచుకుని గంజాయి వాడకం జరుగుతోంది. జిల్లా కేంద్రమైన చిత్తూరులో కాలేజీలతో పాటు ఇళ్ల వద్ద ఉండే యువత కూడా గంజాయికి బానిసైంది. ఓవర్ బ్రిడ్జి కింద, పాత బస్టాండు, పీవీకేఎన్ డిగ్రీ కళాశాల వద్ద యథేచ్ఛగా గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. అదేవిధంగా కొందరు విక్రయదారులు యువత అడిగిన చోటకే డెలివరీ ఇస్తున్నట్లు సమాచారం.

రౌడీషీట్లు తెరుస్తాం

ఇప్పటికే ముగ్గురు గంజాయి స్మగ్లర్లపై రౌడీషీట్లు తెరిచాం. కొంత మంది కింగ్‌పిన్‌లను అరెస్టు చేశాం. గంజాయి రవాణా, విక్రయదారులు ఎంతటివారైనా వదలిపెట్టం, చట్టపరంగా తీసుకోవాల్సిన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. యువత కూడా గంజాయి మత్తులో పడి జీవితాలను నాశనం చేసుకోకూడదు.
- చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి

ఈ ఏడాది పట్టుబడింది ఇవీ..

- ఈ ఏడాది ఫిబ్రవరిలో బంగారుపాళ్యం టోల్‌ప్లాజా వద్ద నలుగురిని అరెస్టు చేసి 94కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విశాఖ నుంచి సేలంకు తరలిస్తుండగా దాడులు చేసి పట్టుకున్నారు.
- పలమనేరు పట్టణంలో పది రోజుల కిందట పది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పలమనేరులోనే మూడు విడతలుగా 30 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని 12 మందిని అరెస్టు చేశారు.
- మదనపల్లె కేంద్రంగా భార్యాభర్తలు కలిసి విశాఖ నుంచి గంజాయిని తెచ్చుకుని స్థానికంగా సరఫరా చేస్తున్నారు. వీరి నుంచి పుంగనూరు, పలమనేరు, గంగవరం, పెద్దపంజాణి ప్రాంతం వాళ్లు తెచ్చుకుంటున్నారు. దీనిని గ్రహించిన పలమనేరు పోలీసులు భార్యాభర్తలను అరెస్టు చేసి చిత్తూరు జైలుకు తరలించారు.
- రేణిగుంట విమానాశ్రయంలో పనిచేసే చిత్తూరుకు చెందిన ఓ హోంగార్డు రేణిగుంట నుంచి చిత్తూరుకు గంజాయి తీసుకొస్తూ పట్టుబడ్డాడు. ● చిత్తూరు నగరం జానకారపల్లె, సంతపేట, ఓబనపల్లె, కొండమిట్ట, తదితర ప్రాంతాలకు చెందిన ఏడుగురు యువకులు పది కిలోల గంజాయిని వివిధ ప్రాంతాల్లో విక్రయిస్తుండగా పట్టుకుని రిమాండుకు పంపారు.
- కుప్పంలో ఓ సారి పది కిలోలు, మరోసారి ఐదు కిలోలు, పుంగనూరులో ఐదు కిలోల గంజాయిని పట్టుకునారు.
- తాజాగా గంగవరం మండలంలో పది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఏడుగురిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

పట్టుబడ్డ గంజాయి ముఠా



గంజాయితో పాటు నిందితులను చూపుతున్న పోలీసులు

● ఏడుగురు నిందితుల అరెస్టు
● 10 కిలోల గంజాయి, 5 వాహనాలు సీజ్

గంగవరం, మార్చి 22: సులభంగా డబ్బు సంపాదించి.. జల్సా చేసే గంజాయి విక్రయ ముఠాను పలమనేరు రూరల్ సర్కిల్ పోలీసులు పట్టుకున్నారు. పది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను శుక్రవారం గంగవరం పోలీసు స్టేషన్‌లో పలమనేరు రూరల్ సీఐ కృష్ణమోహన్ మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం.. పలమనేరు, గంగవరం, బైరెడ్డిపల్లె ప్రాంతాల్లో కొద్దిరోజులుగా విచ్చలవిడిగా గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం వచ్చింది. దీనిపై ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి నిఘా పెట్టారు. ఈ క్రమంలో పలమనేరు-కుప్పం రహదారిలో బైరెడ్డిపల్లె మండలం కైగల్ సమీపంలో శుక్రవారం వేకువజామున గంజాయి తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. వెంటనే పోలీసులు దాడులు చేసి గంజాయి ముఠా సభ్యులను పట్టుకున్నారు. వారిని విచారించగా.. పలమనేరుకు చెందిన షేక్ సలీం(47), వెంకటేష్(54) విశాఖ నుంచి గంజాయి తెప్పించేవారని తేలింది. ఇలా తీసుకొచ్చిన గంజాయిని వెంకటేష్ ఆటోలో తీసుకెళ్లి బైరెడ్డిపల్లె మండలం గుంతకురపల్లికి చెందిన ఎం.చిరంజీవి(46) డి.రెడ్డెప్ప (48), వెంగంవారిపల్లెకి చెందిన వై.సుబ్రమణ్యం(47) ఎం.కొత్తూరుకు చెందిన ఎం.పుష్పకుమార్ అలియాస్ పెద్దప్పయ్య (47), వి.కోట మండలం దాసార్లపల్లెకు చెందిన లోకేష్(51)కు అందించేవారు. దీనిని వాళ్లు చిన్నచిన్న ప్యాకెట్లుగా తయారుచేసి పలమనేరు, బైరెడ్డిపల్లె, వి.కోట మండలాలతోపాటు కర్ణాటక సరిహద్దుల్లో విక్రయించి పెద్దమొత్తంలో సొమ్ముచేసుకొనేవారు. ఇలా సంపాదించిన సొమ్ముతో జల్సాలకు అలవాటు పడ్డారు. పలుమార్లు గంజాయి తెప్పించి విక్రయించినట్లు పోలీసుల విచారణలో వీరు అంగీకరించారు. దీంతో ఈ ఏడుగురిని అరెస్టు చేసి.. వారి నుంచి 10 కిలోల గంజాయి, ఒక ఆటో, నాలుగు ద్విచక్రవాహనాలను సీజ్ చేసి కోర్టుకు హాజరు పరిచారు. ఈ గంజాయి ముఠాను పట్టుకోవడానికి కృషిచేసిన గంగవరం, బైరెడ్డిపల్లె పోలీసులను సీఐ అభినందించారు.

కోడ్ ఉల్లంఘనులపై వేటు

చిత్తూరు కలెక్టరేట్/చిత్తూరు రూరల్, మార్చి 22: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి ప్రచారాల్లో పాల్గొన్న కొందరు కాంట్రాక్టు ఉద్యోగులపై వేటు పడింది. చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో హెచ్ఐవీ, ఏఆర్‌టీ సెంటర్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగి దాసరి కృష్ణమూర్తి పార్టీ ప్రచారంలో పాల్గొన్నట్లు తేలడంతో ఉద్యోగం నుంచి తొలగిస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. చిత్తూరు ఆస్పత్రిలో పనిచేసే కృష్ణమూర్తి సొంతూరు సోమల మండలం గున్నావారిపల్లె. పుంగనూరు టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డికి మద్దతుగా సోమల మండలంలో రెండ్రోజుల కిందట ఆయన ప్రచారంలో పాల్గొన్నారు. దీనిపై మండల అధికారులు పరిశీలించి కలెక్టర్‌కు నివేదిక అందించడంతో ఆయన్ను విధుల నుంచి తొలగించారు.

సంఘమిత్ర తొలగింపు

చిత్తూరు రూరల్: చిత్తూరు రూరల్ మండలం పెరుమాళ్లకండ్రిగ-1 సంఘమిత్ర లత ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారని కలెక్టర్‌కు ఫొటో సహా ఫిర్యాదు అందింది. దీనిపై పరిశీలించి ఆమెను విధుల నుంచి తొలగిస్తున్నట్లు కలెక్టర్ షన్మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు.

మంగళంపేట ఉపాధి ఎఫ్ఏ సస్పెన్షన్

కల్లూరు: పులిచెర్ల మండలం మంగళంపేట పంచాయతీ ఉపాధి హామీ పథకం క్షేత్రసహాయకుడు మధుసూదన్‌ను సస్పెండ్ చేస్తూ శుక్రవారం డ్వామా పీడీ రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఏపీడీ శ్రీనివాసులు తెలిపారు. ఈనెల 17వ తేదీన వైసీపీ ఆధ్వర్యంలో మండలంలో నిర్వహించిన ద్విచక్ర వాహనం ర్యాలీలో ఈయన పాల్గొన్నట్లు స్థానిక టీడీపీ నేతలు సీ-విజిల్ యాప్‌లోను, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎంపీడీవో సురేష్‌బాబు విచారణ చేపట్టి ఎఫ్ఏ ద్వారా సంజాయిషీ తీసుకొని నివేదికను డ్వామా పీడీ రాజశేఖర్‌కు పంపారు. దీంతో ఆయన ఎఫ్ఏను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

వైసీపీ ప్రచారంలో వెలుగు సీసీ



వైసీపీ ప్రచారంలో పాల్గొన్న పుంగనూరు వెలుగు సీసీ గంగాధర్

● ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిన టీడీపీ

పుంగనూరు, మార్చి 22: పుంగనూరులో వైసీపీ కండువా కప్పుకొని వెలుగు కమ్యూనిటీ కోఆర్డినేటర్ ఎస్.గంగాధర్ ఎన్నికల ప్రచారం చేస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ నేతలు ఫొటోలు సహా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. పుంగనూరు దోబీకాలనీకి చెందిన గంగాధర్ మండలం వెలుగు కార్యాలయంలో సీసీగా పనిచేస్తున్నారు. ఆయన భార్య మాజీ కౌన్సిలర్, వైసీపీ నాయకురాలు. ఇటీవల మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిని గెలిపించాలంటూ అతడు ఎన్నికల కోడ్ ఉల్లంఘించి ప్రచారం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో వైసీపీ ఎన్నికల ప్రచారాల ఫొటోలు చక్కర్లు కొట్టాయి. కాగా, తాను ప్రచారంలో పాల్గొనలేదని, గతంలో గడపగడప కార్యక్రమాల్లో తిరిగిన ఫొటో అంటూ గంగాధర్ తెలిపారు.

27న ప్రజాసంకల్పయాత్ర

● పలమనేరు నుంచి చంద్రబాబు ప్రారంభిస్తారన్న అమర్

పలమనేరు, మార్చి 22: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు చేపడుతున్న ప్రజాసంకల్పయాత్రను ఈనెల 27వ తేది పలమనేరు నుంచి ప్రారంభిస్తారని మాజీ మంత్రి అమరనాథరెడ్డి శుక్రవారం తెలిపారు. రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా పలమనేరు నియోజకవర్గం నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రత్యేకంగా గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు చేస్తామని, అందులో స్థానిక, వ్యక్తిగత సమస్యలపై ప్రజలు లిఖితపూర్వకంగా తెలియజేసేందుకు వీలుంటుందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక వంద రోజుల్లో ఆ సమస్యలను పూర్తి చేయనుందన్నారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందన్న ఉద్దేశ్యంతో చాలామంది టీడీపీ వైపు మొగ్గుచూపుతున్నారని పేర్కొన్నారు. ఇది శుభపరిణామమన్నారు.

సహకార సంఘాల ఇన్‌చార్జిలు,
డైరెక్టర్లు సంస్థ వాహనాలు వాడరాదు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 22: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సహకార బ్యాంకులు, సంఘాలు అనుసరించాల్సిన మార్గదర్శకాలను జిల్లా సహకారశాఖ అధికారి నాగవర్దన శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. జిల్లా సహకారకేంద్ర బ్యాంకు, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ, కో-ఆపరేటివ్ ప్రింటింగ్ ప్రెస్‌లతోపాటు జిల్లాలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (సింగిల్ విండోలు) ఎన్నికల కోడ్ అమలులో ఉన్నంతవరకు సాధారణ వ్యాపార లావాదేవీలు మినహా సవరణలు, కొత్త పథకాలు అమలు చేయరాదని, పాలకవర్గాలు విధాన నిర్ణయాలు తీసుకోకూడదని ఆప్కాబ్ ఆదేశాలు జారీచేసిందన్నారు. డీసీసీబీ, సీడీసీఎంఎస్, ప్రింటింగ్ ప్రెస్ పర్సన్ ఇన్‌చార్జిలు, డైరెక్టర్లు సంస్థల వాహనాలను వాడరాదని, సంస్థల ప్రాంగణాలను, వసతిని రాజకీయ సమావేశాలకు ఉపయోగించరాదని స్పష్టం చేశారు. సహకార సంస్థల ఉద్యోగులు ఏ పార్టీకి, అభ్యర్థికి అనుకూలంగా వ్యవహరించరాదని, ప్రచారాల్లో పాల్గొనరాదని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సంస్థల ఆవరణలో ప్రజాప్రతినిధుల ఫొటోలు, రాతలు, పోస్టర్లు, కటౌట్లు, హోర్డింగులు, బ్యానర్లు, జెండాలు ఉంటే, వాటిని వెంటనే తొలగించాలన్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (శనివారం): సా. 6.29
సహరి (ఆదివారం) : ఉ. 4.55

రూ.2.50 లక్షల సీజ్



స్వాధీనం చేసుకున్న నగదును చూపిస్తున్న సీఐ ఉలసయ్య

చిత్తూరు, మార్చి 22: ఎలాంటి ఆధారాల్లేకుండా తీసుకెళుతున్న ఓ వ్యక్తి నుంచి రూ. 2.50 లక్షలను పోలీసులు సీజ్ చేశారు. సీఐ ఉలసయ్య తెలిపిన వివరాల మేరకు.. సాధారణ వాహనాల తనిఖీల్లో భాగంగా శుక్రవారం రెండో పట్టణ పోలీసులు కాణిపాకం బైపాస్ రోడ్డులో వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఐరాలకు చెందిన మహేష్ నాయుడు ద్విచక్ర వాహనంలో రూ. 2.50 లక్షలను తీసుకుని వస్తున్నాడు. ఎలాంటి ఆధారాలు లేకుండా డబ్బులు ఉండటంతో పోలీసులు సీజ్ చేశారు. తన కుమార్తె పెళ్లి కోసం డబ్బులను తీసుకొస్తున్నాడని మహేష్ నాయుడు తెలిపారు. సరైన ఆధారం చూపించి నగదును తీసుకోవాలని పోలీసులు సూచించారు.

చంద్రశేఖర్ మృతదేహం అప్పగింత

వెదురుకుప్పం, మార్చి 22: వెదురుకుప్పం మండలం మాంబేడు గ్రామ పంచాయతీ మర్రిమాకుల కండ్రిగకు చెందిన రైతు చంద్రశేఖర్ మృతదేహాన్ని శుక్రవారం బంధువులకు అప్పగించారు. పోలీసులు కొట్టారన్న అవమానంతో ఈయన గురువారం ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించారు. మృతుడి స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, చంద్రశేఖర్ ఆత్మహత్యకు కారకురాలు.. అతడి వదిన శారద అని పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనలో పోలీసులపైన ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఆశీర్వాదం, వేలును శుక్రవారం వీఆర్‌కు పంపారు. వెదురుకుప్పం ఎస్‌హెచ్‌వోగా సుదర్శనంకు అప్పగించారని తెలిసింది.

గుడిపాల స్టేషన్‌లో స్వల్ప ఉద్రిక్తత


టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ

గుడిపాల, మార్చి 22: గుడిపాల పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం టీడీపీ నాయకులు, ఎస్‌ఐ శ్రీనివాసరావు మధ్య స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. వివరాల్లోకి వెళితే.. గుడిపాల పంచాయతీ అనుపు ఎస్టీ కాలనీలో గ్రామస్థుల కోరిక మేరకు టీడీపీ నాయకులు.. మాజీ సర్పంచి రవినాయుడు, తెలుగు యువత అధ్యక్షుడు శంకర్ తాగునీటి ట్యాంకును ఏర్పాటు చేశారు. ఆ సింథటిక్ ట్యాంకు పసుపు రంగులో ఉండడంతో స్థానిక వైసీపీ వాళ్లు కొందరు ఎస్‌ఐకు ఫిర్యాదు చేశారు. దీంతో రవినాయుడు, శంకర్‌ను ఎస్‌ఐ స్టేషన్‌కు తీసుకొచ్చారు. కంపెనీ వాళ్లు ఇచ్చిన మేరకు ట్యాంకు పసుపు రంగులో ఉందని, దాని మీద ఎలాంటి పార్టీ గుర్తులు, పేర్లు లేవని చెప్పినా ఆయన వినిపించుకోలేదు. బైండోవర్ చేస్తానని ఎస్‌ఐ చెప్పడంతో టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున పోలీసు స్టేషన్ వద్దకు చేరుకున్నారు. దీంతో ఎస్‌ఐ వారిని పంపించేసి శనివారం మళ్లీ రావాల్సి ఉంటుందని చెప్పారు.

నీళ్ల ట్యాంకుకు వైసీపీ రంగు



బంగారుపాళ్యం, మార్చి 22: బంగారుపాళ్యం మండలం కాటప్పగారిపల్లె పంచాయతీ ఎద్దులవారిపల్లె గ్రామసమీపంలోని తాగునీటి ట్యాంకుకు వైసీపీ రంగులున్నాయి. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా ఆ రంగులను మార్చకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

ఇవిగో నేతల ఫొటోలు

- కోడ్ వచ్చినా అలాగే ఉంచారంటూ సోషల్ మీడియాలో విమర్శలు
- పెయింట్ వేయించిన అధికారులు

రామకుప్పం, మార్చి 22: ఎన్నికల కోడ్ వచ్చింది. అయినా, రామకుప్పంలోని దిగువవీధిలో సుజల ప్లాంట్‌పై దివంగత సీఎం వైఎస్ఆర్, సీఎం జగన్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఫొటోలు.. స్థానిక మినీ మార్కెట్ యార్డు ఆవరణలో శిలాఫలకాలపై వైసీపీ రంగులు అలాగే ఉన్నాయి. అధికారులపై తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో టీడీపీ శ్రేణులు వాటికి సంబంధించి వీడియోలు, ఫొటోలను శుక్రవారం ఉదయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. ఎంపీడీవో ఈశ్వరయ్య, గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకటరవిప్రసాద్, వీఆర్వో మహేష్ తదితర అధికారులు స్పందించారు. వెంటనే సుజలప్లాంట్‌పై ఉన్న నేతల ఫొటోలపై సిమెంటు కలర్ పెయింట్ వేయించారు. మినీమార్కెట్ యార్డు వద్ద శిలాఫలాకాలను పేపర్లతో కప్పి, గోడలపై ఉన్న వైసీపీ రంగులపై సిమెంటు కలర్ వేయించారు. అలాగే,పట్టణంలో పలు చోట్ల ఉన్న టీడీపీ భవిష్యత్తుకు భరోసా గోడపత్రికలపైనా సిమెంటు కలర్ పెయింట్ వేశారు. గ్రామకార్యదర్శులు, వీఆర్వోల తీరుపై ఎంపీడీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని అన్ని గ్రామాలను సందర్శించి ప్రభుత్వ భవనాలు, ఇతర సామగ్రిపై రాజకీయనేతల ఫొటోలు, పబ్లిక్ ప్లేస్‌లలో రాజకీయ పార్టీల గోడపత్రికలుంటే శనివారం సాయంత్రంలోగా వాటిపై వేరే రంగులు వేయించాలని ఆదేశించారు.


శిలాఫలకాలపై పేపర్లు అతికించి, వైసీపీ రంగులపైనా వేరే రంగు వేయిస్తున్న అధికారులు


శుక్రవారం మధ్యాహ్నం సుజల ప్లాంట్‌పై సీఎం, మంత్రి ఫొటోలకు రంగులేశారిలా..

కాలికి గాయమై వస్తే హెచ్‌ఐవీ వుందన్నారు!

- రుయాస్పత్రి ల్యాబ్ సిబ్బంది తప్పుడు రిపోర్టుతో వైద్యులు ఆపరేషన్ చేయలేమన్నారు
- కుంగిపోయిన ఎర్రావారిపాళెం యువకుడు

తిరుపతి(వైద్యం), మార్చి 22 : రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రికి వస్తే చికిత్సలో భాగంగా చేసిన రక్త పరీక్షల్లో హెచ్‌ఐవీ పాజిటివ్ అని తప్పుడు రిపోర్టు ఇచ్చి చికిత్స చేయకుండా ఇబ్బందులకు గురి చేయడంపై బాధితుడు రుయాస్పత్రి సూపరింటెండెంట్ రవిప్రభుకు శుక్రవారం ఫిర్యాదు చేశారు.బాధితుడి కథనం మేరకు ఎర్రావారిపాళెం మండలానికి చెందిన ఓ యువకుడు ఈ నెల 13న రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. కాలికి తీవ్రగాయం కావడంతో కుటుంబ సభ్యులు రుయాస్పత్రిలో అడ్మిట్ చేయించారు. కాలికి సర్జరీ చేయాలన్న వైద్యులు రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అదే రోజు ఆస్పత్రిలోని ల్యాబ్‌లో రక్త నమూనాలు ఇవ్వడంతో సిబ్బంది పరీక్షలు నిర్వహించి మరుసటి రోజు రిపోర్టు ఇచ్చారు. అందులో హెచ్‌ఐవీ పాజిటివ్ అని ఉండడంతో ఆ యువకుడు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యాడు. అనుమానం వచ్చి అదేరోజు పక్కనే స్విమ్స్‌లో రక్త పరీక్షలు చేయించగా అక్కడ హెచ్‌ఐవీ నెగటివ్ వచ్చింది. ఆ రిపోర్టును తీసుకువచ్చి రుయాస్పత్రి వైద్యులకు చూపించి తనకు వెంటనే సర్జరీ చేయాలని కోరినా వారు పట్టించుకోలేదని బాధితుడు వాపోయారు. తిరిగి రుయాస్పత్రిలో ఈ నెల 20న రక్త పరీక్ష చేయించగా అందులో హెచ్‌ఐవీ నెగటివ్ వచ్చింది. మొదట ఇచ్చిన తప్పుడు రిపోర్టు వలన తన కుమారుడు మానసికంగా కుంగిపోయి ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధమయ్యాడని, దీనికి తప్పుడు రిపోర్టు ఇచ్చిన రుయాస్పత్రి సిబ్బందే కారణమని బాధిత యువకుడి తండ్రి వాపోయాడు.దీనిపై విచారించి చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్ రవిప్రభును శుక్రవారం కోరారు.

రుయాస్పత్రిలో రీటెండరు మాయాజాలం

- పారిశుధ్య ఏజెన్సీ నియామకంలో కాలయాపన
- వేరొక పేరుతో పాత వారికే కట్టబెట్టే యత్నం


టెండరు వేస్తున్న అభ్యర్థి

తిరుపతి(వైద్యం), మార్చి 22 : నిబంధనలు పాటించకుండా అవకతవకలకు పాల్పడుతున్న ఏ-1 పారిశుధ్య ఏజెన్సీని తక్షణమే రద్దు చేసి ఆ స్థానంలో మరొక ఏజెన్సీని నియమించాలని ఐదు నెలల కిందట డీఎంఈ, కలెక్టర్ ఆదేశించారు. వాటిని ఏ మాత్రం పట్టించుకోకుండా ఐదు నెలలుగా అధికారులు కాలయాపన చేస్తున్నారు. దీని వెనుక పెద్ద మాయాజాలమే జరుగుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. రుయా, ఎస్వీ వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాలకు సంబంధించి పారిశుధ్య పనులను ఏ-1 ఏజెన్సీ చూస్తోంది.వారు నిబంధనలు పాటించకపోగా 205 మంది కార్మికులకు గాను కేవలం వంద మందితో పనిచేయిస్తుండడం, తక్కువ వేతనాలు చెల్లించడం వంటి ఫిర్యాదులు రావడంతో కొత్తవారిని నియమించాలని గత ఏడాది అక్టోబరులో డీఎంఈ నరసింహం రుయా అధికారులను ఆదేశించారు. కానీ కలెక్టర్ అందుబాటులో లేరని, డీఎంఈ నుంచి రాతపూర్వకంగా ఆదేశాలు రాలేదని రుయా అధికారులు కాలయాపన చేస్తూ వస్తున్నారు. ఏజెన్సీ నిర్వహణకు మే 31వ తేదీ వరకే గడువు ఉండటం, ఆపై మరో రెండేళ్లు పొడిగించే అవకాశం ఉండటంతో ప్రస్తుత ఏజెన్సీ నిర్వాహకులు అధికార పార్టీకి చెందిన కొందరు ముఖ్యనేతల నుంచి రుయా అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చినట్లు సమాచారం. కలెక్టర్ ఈ విషయాన్ని తెలుసుకుని తక్షణమే రీటెండరు నిర్వహించాలని ఆదేశించడంతో శుక్రవారం రీటెండరు ప్రక్రియ మొదలుపెట్టారు. నాలుగు టెండర్లు వచ్చినట్లు రుయా అధికారులు తెలిపారు. ప్రస్తుత ఏజెన్సీ నిర్వాహకులు కూడా బినామీ పేర్లతో టెండర్లు వేసినట్లు సమాచారం. మరి అధికారులు దీనిపై ఎలా స్పందిస్తారో చూడాల్సి ఉంది.

సంస్కృత వర్సిటీలో రిక్రూట్‌మెంట్ డ్రైవ్

తిరుపతి(రూరల్), మార్చి 22: జాతీయ సంస్కృతవర్సిటీలో మోడల్ కెరీర్‌సెంటర్ ఆధ్వర్యంలో అరుణాచల్ ప్రదేశ్‌లోని వివేకానంద కేంద్ర పాఠశాలలో సంస్కృత అధ్యాపకుల నియామకాల కోసం శుక్రవారం రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఎనిమిది అధ్యాపక పోస్టులకు 50 మందికిపైగా విద్యార్థులు హాజరైనట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్‌జే రమాశ్రీ పేర్కొన్నారు. వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, మోడల్ కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ జేబీ చక్రవర్తి, వివేకానంద కేంద్ర పాఠశాల ప్రిన్సిపాల్ కె.జయసర్కార్, హెచ్‌ఆర్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధి అనిమేశ్, మారుతి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రకటనలకు ఎంసీఎంసీ అనుమతి తప్పనిసరి

- జిల్లా ఎన్నికల అధికారి షన్మోహన్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 22: ఎన్నికల ప్రచారాల్లో భాగంగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనల నిమిత్తం మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) అనుమతి తప్పనిసరి అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. కమిటీని కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ఏర్పాటు చేశామన్నారు. తన అధ్యక్షతన ఏర్పడిన ఈ కమిటీలో ఏఆర్వోగా డీఆర్వో పుల్లయ్య, సోషల్ మీడియా ఎక్స్‌పర్ట్ నాగేశ్వరరావు, ఐఈఏఈ టీకే సుధాకర్, మీడియా ప్రతినిధులుగా సీపీరావు, ఎం.శ్రీనివాస మూర్తి, ఐఅండ్‌పీఆర్ డీడీ పద్మజ వ్యవహరిస్తారన్నారు. ప్రసార అనుమతుల కోసం వచ్చే పొలిటికల్ అడ్వర్టైజ్‌మెంట్లు నిబంధనల మేరకు ఉన్నాయో లేదో కమిటీ పరిశీలించి ప్రీసర్టిఫికెట్ ఇస్తుందన్నారు. ఈ సర్టిఫికేషన్ లేకుండా ప్రసారం చేస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



వారంలోగా ఓటరు నమోదు, బదిలీ పరిశీలన పూర్తిచేస్తాం

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఓటరు నమోదు, బదిలీ తదితరాలకు సంబంధించిన 6, 7, 8 దరఖాస్తు ఫారాల పరిశీలన వారంరోజుల్లోపు పూర్తిచేస్తామని కలెక్టర్ షన్మోహన్ అన్నారు. శుక్రవారం విజయవాడ నుంచి ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి హాజరైన షన్మోహన్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. త్వరలో పీవో, ఏపీవోలకు రెండో విడత శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. కలెక్టరేట్ నుంచి డీఆర్వో పుల్లయ్య పాల్గొన్నారు.

అంకుర సంస్థల ఏర్పాటుపై దృష్టి సారించండి

తిరుపతి(రూరల్),మార్చి22: వ్యవసాయ కోర్సులు చదివే విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా అంకుర సంస్థల ఏర్పాటుపై దృష్టి సారించాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సి.రమణ పేర్కొన్నారు. ఆర్ఏఆర్ఎస్‌లో ఆర్‌కేవీవై రాఫ్తార్‌పథకం ద్వారా నిర్వహించే ఆంగ్రు అగ్రి బిజినెస్ ఇంక్యుబేటర్ ఆధ్వర్యంలో శుక్రవారం అగ్రివిజన్1.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఏడీఆర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలకు పరిష్కారం చూపే విధంగా ఆవిష్కరణలు రూపొందించి, తద్వారా కొత్త సంస్థల ఏర్పాటుకు ముందుకు రావాలని తెలిపారు. కాగా అగ్రి బిజినెస్ కేంద్రం ద్వారా శిక్షణ పూర్తి చేసి, ఆర్థిక సహకారం అందుకున్న మొదటి, రెండవ బ్యాచ్‌లకు చెందిన అంకుర సంస్థలకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ పి.బాలహుస్సేన్‌రెడ్డి, డాక్టర్ పీవీ సత్యగోపాల్, డాక్టర్ ఆర్.కల్పనాశాస్త్రి, ఎం.శ్రీనివాసరెడ్డి, సి.సునీల్ పాల్గొన్నారు.



ఏపీని డ్రగ్స్ క్యాపిటల్‌గా మార్చేసిన వైసీపీ

- మాజీ మంత్రి అమర్ ఆవేదన

బైరెడ్డిపల్లె, మార్చి 22: టీడీపీ హయాంలో పరిశ్రమల స్థాపనకు, పెట్టుబడుల ఆకర్షణలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉండేదని, అలాంటి రాష్ట్రాన్ని ఇప్పుడు వైసీపీ డ్రగ్స్ క్యాపిటల్‌గా మార్చేసిందని మాజీమంత్రి అమరనాథరెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన బైరెడ్డిపల్లె మండలం కమ్మనపల్లె పంచాయతీలో పర్యటించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. దేశంలో గంజాయి ఎక్కడ పట్టుబడినా దాని మూలాలు ఆంధ్రప్రదేశ్‌లో దొరుకుతుండడం చూస్తుంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో తెలుస్తోందన్నారు. కల్తీమద్యం మాఫియాతో ఇన్నాళ్లు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతూ, యువతను నాశనం చేస్తున్నారని ఆరోపించారు. యువతను మత్తుకు బానిసచేసి వారు ప్రశ్నించడానికి వీలుకాకుండా అణగదొక్కేశారని ఆవేదన వ్యక్తంచేశారు. డ్రగ్స్ కుంభకోణం వెనుక తాడేపల్లి హస్తంవుందని, అందుకే వైసీపీనేతలు తీవ్రంగా స్పందిస్తున్నారని విమర్శించారు. విశాఖ కేంద్రంగా డ్రగ్స్ మాఫియాను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించడానికి ప్రయత్నిస్తున్నారని తీవ్రంగా దుయ్యబట్టారు. అన్నపూర్ణలాంటి ఆంధ్రప్రదేశ్‌ను వైసీపీ పాలనలో డ్రగ్స్ ఆంధ్రగా మార్చేశారని విమర్శించారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలన్నిటినీ ప్రజలు అర్థం చేసుకుంటున్నారని, వైసీపీకి తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా వున్నారన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం


రాజశేఖర్ (ఫైల్ ఫొటో)

శాంతిపురం, మార్చి 22: శాంతిపురం మండలంలో ఓ యువకుడు విద్యుదాఘాతానికి గురై దుర్మరణం పాలయ్యాడు. బురడసిద్దనపల్లెకు చెందిన రాజశేఖర్(17) శుక్రవారం మేత కోసం పశువులను స్థానిక ఖుషీడైరీ సమీపంలోని వ్యవసాయ పొలాలకు తీసుకెళ్ళాడు. పశువుల కోసం జొన్న ఆకులు కోసేందుకు పొలం వద్ద గల ఓ చెట్టుపైకి ఎక్కాడు. దురదృష్టవశాత్తు చెట్టు పక్కనే ఉన్న విద్యుత్ తీగలు తగిలి రాజశేఖర్ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాళ్ళబూదుగూరు పోలీసులు కేసు నమోదు చేసి శావాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.





పుష్కరిణిలో మలయప్ప కటాక్షం

తిరుమల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : తెప్పోత్సవాల్లో భాగంగా రెండురోజుల పాటు శ్రీరామ, శ్రీకృష్ణ రూపాల్లో దర్శనమిచ్చిన శ్రీవారు మూడో రోజైన శుక్రవారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిగా తెప్పపై భక్తులను కటాక్షించారు.అంతకుముందు ఉత్సవమూర్తులను మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం పుష్కరిణిలో తెప్పపై కొలువుదీర్చారు. విద్యుద్దీపాల వెలుగులు, వేదం, నాదం, గోవిందనామస్మరణల మధ్య తెప్పపై శ్రీవారు విహరించారు.శనివారం ఐదుచుట్లు, ఆదివారం ఏడుచుట్లు పుష్కరిణిలో తెప్పపై మలయప్ప స్వామి విహరించనున్నారు.

రెండు గంటలు ఆలస్యంగా ఏపీ సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్

తిరుపతి సెంట్రల్ మార్చి22 : తిరుపతి-నిజాముద్దీన్ స్టేషన్ల మధ్య నడిచే ఏపీ సంపర్క్ క్రాంతి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ శుక్రవారం ఉదయం రెండు గంటలు ఆలస్యంగా బయలుదేరింది. నిజాముద్దీన్ నుంచి తిరుపతికి చేరుకున్న ఈ ఎక్స్‌ప్రెస్‌కు మరమ్మతులు చేసే సమయంలో రెండు జనరల్ కోచ్‌లు రవాణాకు ఉపయోగపడవని కోచ్ అండ్ వ్యాగన్ శాఖ అధికారులు నిర్ధారించారు.ప్రత్యామ్నాయ బోగీలను సకాలంలో ఏర్పాటుచేయకపోవడంతో తిరుపతి నుంచి 21 పెట్టెలకు బదులు 19 పెట్టెలతోనే రైలు బయల్దేరింది. తద్వారా దాదాపు 200 మంది ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారు. శుక్రవారం ఉదయం 5.30 గంటలకు బయలుదేరాల్సిన ఈ ఎక్స్‌ప్రెస్ 7.45 గంటలకు బయలుదేరినట్లు అధికారులు తెలిపారు.

మద్యం తరలిస్తూ దొరికిపోయారు!

- ఇద్దరు సేల్స్‌మేన్, ఇద్దరు ట్రాన్స్‌పోర్టర్ల అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 22 : తిరుపతి రూరల్ మండలం తనపల్లిలోని ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి మద్యం తరలిస్తున్న నలుగురిని శుక్రవారం సెబ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.40వేల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నారు. సెబ్ రూరల్ సీఐ భీమలింగం సిబ్బందితో కలసి మద్యం దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. తనపల్లి దుకాణంలో పనిచేస్తున్న బండి అబ్దుల్ రెహ్మాన్, ఎస్.రాజా శుక్రవారం 102 రాయల్ ప్యాలెస్ క్వార్టర్ బాటిళ్లను యుగంధర్, చెంజి సుబ్రహ్మణ్యం ద్వారా స్కూటీలో తిరుచానూరుకు తీసుకెళుతున్నారు. సెబ్ అధికారులు తనపల్లి ఐస్ ఫ్యాక్టరీ వద్ద వారిని పట్టుకుని మద్యం స్వాధీనం చేసుకున్నారు.

ప్చ్... ఈసారీ అంతేనా!

- మామిడిలో కనిపించని పూత
- దిగుబడిపై రైతుల ఆందోళన

పలమనేరు, మార్చి 22: జిల్లాలో ఈసారి కూడా మామిడిలో సాధారణ దిగుబడి కూడా వచ్చే సూచనలు కనిపించడం లేదు. మామూలుగా అయితే, ఇప్పటికే మామిడి తోటలు పూతతో కళకళలాడుతుండాలి. కానీ, ఇందుకు భిన్నంగా లేత ఆకులతోను, పచ్చదనంతో ఉండి పూత నామమాత్రంగా కనిపిస్తోంది. ఉద్యానవన లెక్కల మేరకు ఈ ఏడాది పంట దిగుబడి గణనీయంగా తగ్గుతుందని అంచనా. వాతావరణంలో వచ్చిన పెనుమార్పులే దీనికి కారణమని అంటున్నారు. గతేడాది నవంబరు, డిసెంబరు నెలల్లో అధికారులు మామిడి రైతులకు సమావేశాలు నిర్వహించి పూత దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అయితే పూతే నామమాత్రంగా కనిపిస్తుండటంతో మామిడి రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా మామిడి సాగు చేయాలంటే ఎకరాకు కనీసం రూ.2.5 లక్షల ఖర్చు అవుతోంది. ఇక ఉన్న మామిడి తోటల నిర్వహణకు కూడా ఎకరాకు కనీసం రూ.లక్ష వ్యయమవుతోందని రైతులు అంటున్నారు. మామిడి తోటల మధ్యఉన్న భూమిని చెత్తా చెదారం లేకుండా ఏపుగా దున్నించడం, కొమ్మలు కత్తిరించడం, కనీసం మూడు పర్యాయాలు రసాయన మందుల పిచికారి చేయించాల్సి ఉంటుందని చెబుతున్నారు. కూలీల కొరత.. ఇవన్నీ పెట్టుబడిపై ప్రభావం చూపుతున్నాయని రైతులు అంటున్నారు.



సగమైనా దిగుబడి వస్తుందా?

జిల్లాలో 54,732 హెక్టార్లలో మామిడి తోటలు సాగుచేస్తున్నారు. ఇందులో గరిష్ఠంగా బంగారుపాళ్యం మండలంలో 6091 హెక్టార్లలో.. కనిష్ఠంగా గుడుపల్లె మండలంలో 33 హెక్టార్లలో మామిడి సాగవుతోంది. సాధారణ దిగుబడి వస్తే హెక్టారుకు 10 టన్నులు ఉండాలి. వాతావరణ మార్పులు కారణంగా పూత అంతంత మాత్రం రావడంతో హెక్టారుకు 4నుంచి 6 టన్నుల మేరకైనా దిగుబడి వస్తుందా అని రైతులు ఎదురు చూస్తున్నారు.

ఊజీల బెడద

కూలీలు, పంట దిగుబడులు తగ్గిపోవడంతో పాటు కొన్నేళ్లుగా మామిడి కాయలకు ఊజీ ఈగలు గుడ్లు పెడుతున్నాయి. ఇవి మామిడి కాయలు బాగా పక్వం దశలో వుండగా పెట్టే గుడ్లు మామిడి కాయలు మాగే దశలో కాయ మొత్తం పురుగులు దర్శనమిస్తున్నాయి. దీంతో ఊజీ ఈగల పట్ల మామిడి రైతులు అధికారుల సూచనలు పాటించడం లేదని తెలుస్తోంది. సస్యరక్షణతో పాటు క్రిమి కీటకాలు, ఊజీల నివారణకు అధికారులు సూచనలు పాటించాల్సిన అవసరం వుంది.

బీమా ఏదీ?

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఒక్కో మామిడి చెట్టుకు రూ.40 నుంచి 50 వరకు బీమా చేయించుకొని పంట నష్టం జరిగితే పరిహారం అందేది. దీనివల్ల ఎంతో కొంత ఊరట కలిగేదని రైతులు అంటున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ క్రాప్ ద్వారా మామిడి పంటను నమోదు చేస్తున్నప్పటికీ బీమా వర్తింపజేయడం లేదని రైతులు చెబుతున్నారు.

సిండికేట్లను అరికట్టాలి

జిల్లాలో పండే మామిడి పంటలో దాదాపు 70 శాతానికిపైగా ఇక్కడి పల్ప్ ఫ్యాక్టరీలు కొంటున్నాయి. అయితే మామిడికి డిమాండు ఉన్నప్పటికీ ఈ ఫ్యాక్టరీల సిండికేట్ కారణంగా తక్కువ ధరలే ఇస్తున్నారని రైతులు అంటున్నారు. ప్రభుత్వం సిండికేట్లను అరికడితే తమ కు గిట్టుబాటు ధర వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

ఎగుమతులకు కొరగాని దిగుబడులు

వాస్తవానికి మామిడి ఎగుబడులకు తగిన విధంగా రైతులు పండించడం లేదని పలువురు అభిప్రాయ పడుతున్నారు. పంటల దిగుబడి, సస్యరక్షణల కోసం రైతులు విపరీతంగా వినియోగించే రసాయన అవశేషాలు మామిడిలో వున్నందును విదేశాలకు ఎగుమతి చేసే అవకాశాలు లేకుండా పోతోందని చెబుతున్నారు. తగిన సూచనలు తీసుకొని పాటిస్తే అధిక లాభాలు వచ్చే అవకాశం లేకపోలేదని అధికారులు చెబుతున్నారు.

చెరకు గానుగలు కనుమరుగవుతున్నాయి

మాజీ మంత్రి అమరనాథ రెడ్డి ఆవేదన

బైరెడ్డిపల్లె, మార్చి 22 : ప్రస్తుతం చెరకు గానుగ పరిశ్రమలు కనుమరుగవుతూ చెరకు రైతులు ఇబ్బందులు పడుతున్నారని మాజీ మంత్రి అమరనాథ రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. కమ్మనపల్లె పంచాయతీలో శుక్రవారం ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా పర్యటించిన ఆయన కమ్మనపల్లె వద్ద చెరకుగానుగ నడుపుతున్న రైతులతో కొంతసేపు మాట్లాడారు. నీటికొరత వల్ల రైతులు చెరకు పంటవైపు ఆసక్తి కనబరచకలేదన్నారు. భవిష్యత్తులో బెల్లం పరిశ్రమలకు మంచి డిమాండ్ వుంటుందని రైతులు చెరకు పంటలను కొనసాగిస్తే బాగుంటుందని కోరారు. అనంతరం టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయనున్న సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరిస్తూ జరగనున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓట్లేసి టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన 200 మంది



పలమనేరు, మార్చి 22 : పలమనేరు టీడీపీ కార్యాలయంలో శుక్రవారం సుమారు 200 మంది వైసీపీకి చెందిన వారు మాజీ మంత్రి అమరనాథరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. 5, 6, 7, 12 వార్డులకు చెందిన వారు టీడీపీ లో చేరగా వారందరికి మాజీ మంత్రి అమరనాథరెడ్డి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో గంటావూరుకు చెందిన మార్కొండ, గోవిందు, బాబు, సుబ్బయ్య, నరసింహులు, కుమార్, గణేష్, రామాంజులు, బాలాజి, హరినాథ్ ఉన్నారు.

చంద్రబాబు విజయం కోసం మసీదులో ప్రార్థనలు



కుప్పం, మార్చి 22: వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు విజయాన్ని ఆకాంక్షిస్తూ శుక్రవారం ముస్లింమైనారిటీలు మసీదులో ప్రార్థనలు జరిపారు. అంతకుముందు టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు గాజుల ఖాదర్‌బాషా మాట్లాడుతూ వైసీపీ హయాంలో ముస్లింలకు జరిగిన మేలేమీ లేదన్నారు. చంద్రబాబు హయాంలో మసీదులకు లక్షలాది రూపాయల నిధు నిధులు మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ ప్రార్థనల్లో టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్.ఆర్.సురేశ్ బాబు, ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షుడు జాకీర్, అన్సర్, సర్దార్, బాదుషా, ఉమర్, ఫిరోజ్, హబీబ్, ఇస్మాయిల్, షబ్బీర్ అలీ పాల్గొన్నారు.

రజక కమ్యూనిటీ భవన నిర్మాణానికి చర్యలు

కుప్పం, మార్చి 22: టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కుప్పం నియోజకవర్గంలో రజకుల కోసం కమ్యూనిటీ భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ హామీ ఇచ్చారు. కుప్పంలో శుక్రవారం రజక సంఘం నేతలు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే రజకులకు రాజకీయంగా నామినేటెడ్ పోస్టుల్లో భర్తీ చేస్తామన్నారు. అలాగే ప్రత్యేకంగా రజకులకోసం కాలనీ ఏర్పాటు చేసి ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రజక సాధికార కమిటీ జిల్లా కన్వీనర్ ఎస్.దయాకర్, మాజీ సర్పంచి గోపాల్, కృష్ణమూర్తి, గంట్లప్ప, పరశురాం, ఐటీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు నరేశ్, వేణుగోపాల్, అశోక్, మురుగేశ్, భరత్, రమేశ్, కృష్ణప్ప, గజేంద్ర, సోమశేఖర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు

రామకుప్పం, మార్చి 22: రామకుప్పం మండలంలోని ఓటర్లకు భరోసా కల్పించేందుకు శుక్రవారం కేంద్ర రిజర్వు పోలీస్ ఫోర్సు, సాయుధ బలగం, స్థానిక పోలీసు సిబ్బంది కవాతు నిర్వహించారు. మండల పరిధిలోని ఉన్సిగానిపల్లె, గోవిందపల్లె, విజలాపురంలలో కుప్పం డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో వారు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు, ఓటర్లు నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవడానికి తాము అన్నివిధాలా సిద్ధంగా ఉన్నామన్నారు. అదేవిధంగా ఎన్నికల ప్రక్రియలో ఎవరైనా ఆటంకాలు సృష్టిస్తే వారు ఎంతటి వారైనా కఠిన చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో కుప్పం రూరల్ సీఐ ఈశ్వర్‌రెడ్డి, ఎస్ఐ శివకుమార్ పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ రూ.3 లక్షలు : కాంగ్రెస్



టమోటా పొలం వద్ద కాంగ్రెస్ నాయకులు

సోమల, మార్చి 22: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో రైతు రుణమాఫీ రూ.3లక్షలు వరకు ప్రకటించనుందని ఆ పార్టీ పుంగనూరు నియోజకవర్గం కన్వీనర్ సింగం రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సోమల, ఇరికిపెంట పంచాయతీలోని పలు గ్రామాల్లో పర్యటించారు. టమోటా తోటలో రైతులను కలసి వారితో కష్టనష్టాలపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుడ్డారెడ్డి, మౌసీనా, మంకు నాయక్, శ్రీదేవి, సైదానీ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ యోధుల చిత్రాలు అదరహో!



కుప్పం, మార్చి 22: ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ల ప్రారంభాన్ని పురస్కరించుకుని చిత్రకళాకారుడు పురుషోత్తం శుక్రవారం చిత్రించిన క్రికెటర్లు మహేంద్ర సింగ్ ధోనీ, విరాట్ కోహ్లీల చిత్రాలు అదరహో అనిపిస్తున్నాయి. గ్రామీణ వాతావరణంలో పచ్చటి పొలాల మధ్య ఆయన చిత్రాలు ఆకట్టుకున్నాయి.

యువత ప్రాణాలతో జగన్ డ్రగ్ మాఫియా చెలగాటం

శాంతిపురం, మార్చి 22: రాష్ట్రంలోని యువత ప్రాణాలతో జగన్ డ్రగ్ మాఫియా చెలగాటమాడుతోందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఎక్కడ గంజాయి, మాదకద్రవ్యాలు పట్టుబడినా వాటి మూలాలు వైసీపీ శ్రేణులతో ముడిపడి ఉంటున్నాయన్నారు. గంజాయి, మాదకద్రవ్యాల కేసుల్లో వైసీపీ నేతలు, కార్యకర్తల ప్రమేయం ఉన్నట్టు పలుసార్లు నిర్ధారణైనా కూడా ఆ పార్టీ పెద్దలు ఆ మరకలను టీడీపీకి అంటించే ప్రయత్నం చేస్తాయన్నారు. విశాఖలో మాదకద్రవ్యాల కంటైనర్‌ను సీబీఐ స్వాధీనం చేసుకున్న ఘటనలో కూడా వారి బుకాయింపులు ప్రారంభమయ్యాయని తెలిపారు. కంటైనర్‌ను సీబీఐ అధికారులు స్వాధీనం చేసుకుంటుంటే రాష్ట్ర పోలీసులు అడ్డుకోవడమేంటని ప్రశ్నించారు. మాదకద్రవ్యాల కంటైనర్ కేసులో వైసీపీ నేత విజయసాయిరెడ్డితోపాటు, ఇతర నేతల ప్రమేయం ఉన్నందువల్లే సీబీఐ అధికారులను నిలువరించే ప్రయత్నం చేశారన్నారు.

పలమనేరులో కాంగ్రెస్ ప్రచారం

పలమనేరు, మార్చి22 : పలమనేరులోని 7,8,9 వార్డుల్లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకొస్తుందన్నారు. ప్రజాసంక్షేమం కోసం పనిచేస్తేది కాంగ్రెస్ పార్టీ మాత్రమే అన్నారు. కాంగ్రెస్ పార్టీనాయకులు శివశంకర్, ఫెరోజ్, మణి, ఏకాంబరం, సిరాజ్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

వృత్తివిద్యాకోర్సులపై అవగాహన

బైరెడ్డిపల్లె: కమ్మనపల్లె ఆదర్శ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం వృత్తివిద్యా కోర్సులపై అవగాహన కల్పించినట్లు ప్రిన్సిపాల్ అనిత తెలిపారు. మదర్‌థెరీసా ఇంజనీరింగ్ కళాశాల ఒకేషనల్ కో-ఆర్డినేటర్లు నాగరాజు, మల్లికార్జునరావు, రమేష్, శ్రీనివాసరావు విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు చెప్పారు.

భావితరాల కోసం నీటిని ఆదా చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి వాసుదేవరావు

పుంగనూరు రూరల్,మార్చి22: భావితరాల కోసం భూగర్భజలాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పుంగనూరు సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవరావు పేర్కొన్నారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడుతూ నీటి వృథాను తగ్గించాలన్నారు. జలవనరుల మీద ప్రతి ఒక్కరూ అవగాహన కలిగివుండాలని సూచించారు. చెరువులు, కుంటలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. వర్షపు నీటిని నిల్వచేసి భూగర్భ జలాలను పెంచుకోవాల్సివుందని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ మేనేజర్ రసూల్‌ఖాన్, న్యాయవాది వీరమోహన్‌రెడ్డి, డీఈ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిని వృథా చేయకండి

పలమనేరు : తాగునీటిని వృథా చేయకూడదని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించాలని పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శుక్రవారం పలమనేరులోని ఎద్దుల సంత వీధిలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించుకోవడంతోపాటు వర్షపు నీటిని వృథాకాకుండా ఇంకుడు గుంతల ద్వారా సంరక్షించుకోవాలని సూచించారు. న్యాయవాది ఎల్. భాస్కర్ మాట్లాడుతూ నీరు వృథా కాకుండా చూడాలన్నారు. నాయవాది అరిఫుల్లా, మున్సిపల్ మేనేజర్ ఖాదర్‌మొహిద్దీన్ పాల్గొన్నారు.

అరాచక వైసీపీని ప్రజలు తరిమికొట్టాలి : చల్లా





టీడీపీలో చేరిన పుంగనూరు ముస్లిం యువకులతో చల్లా రామచంద్రారెడ్డి, చౌడేపల్లె మండల యువకులు

పుంగనూరు, మార్చి 22: రాష్ట్రంలో వైసీపీ, పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి అరాచకాలను ఎన్నికల్లో ప్రజలు తరిమికొట్టాలని టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పుంగనూరు టీడీపీ కార్యాలయంలో స్థానిక భగత్‌సింగ్‌కాలనీ, ఉబేదుల్లా కాంపౌండ్‌లోని ముస్లిం మైనార్టీ యువత, మహిళలు భారీ సంఖ్యలో టీడీపీలోకి ఆహ్వానిస్తూ చల్లాబాబు పార్టీ కండువాలు కప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ పరిపాలనలోనే ముస్లిం మైనార్టీలకు గుర్తింపు రావడం, కార్పొరేషన్, సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రాజెక్టుల పేరుతో ప్రజాధనాన్ని దోచుకుతిన్నారని,ప్రాజెక్టుల్లో భూములు కోల్పోయిన రైతులకు ఇప్పటి వరకు ఒక్క రూపాయి పరిహారం ఇవ్వకుండా మోసం చేశారని మండిపడ్డారు. పుంగనూరు నియోజకవర్గంలో టీడీపీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు ఎం.శ్రీకాంత్, దినేశ్, సుబ్రహ్మణ్యం రాజు, మాధవరెడ్డి, సీవీరెడ్డి, శమిపతి, ఉయ్యాల రమణ, దేశాది ప్రకాశ్, షామీర్, నౌషాద్, ఇమ్రాన్, ఫయాజ్, సయ్యద్, రామయ్య, చంద్ర, ప్రసాద్, గాజుల రమణ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

చౌడేపల్లె : నవ్యాంధ్ర పునర్నిర్మాణం ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమని చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చారాల, దుర్గసముద్రం పంచాయతీల నుంచి 150 మంది యువకులకు చల్లా బాబు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. ఆయన మాట్లాడుతూ వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని, కార్యకర్తలందరూ సమిష్టి కృషితో పనిచేసి పుంగనూరులో టీడీపీ జెండాను ఎగురవేద్దాం అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి, నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, బాబునాయుడు, లక్ష్మీపతిరాజు, బోయకొండ సుబ్రహ్మణ్యం, రెడ్డి, ప్రభాకర్, హరిప్రసాద్, పార్థసారధి, వెంకటరమణ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు : కల్లూరు పంచాయతీ ఈరసానిపల్లికి చెందిన వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎం రత్నం తన అనుచరులతో శుక్రవారం తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. చల్లా రామచంద్రారెడ్డి వీరికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో చిట్టిబాబు, క్రాంతికుమార్, మనోజ్, శ్యామ్, నారాయణ, భారతి, హైమావతి, సతీష్, అమ్ములు, రాముడు, మస్తాన్, కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

యువత భవిత నిర్దేశకుడు చంద్రబాబు : కంచర్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల

కుప్పం, మార్చి 22: యువత భవితవ్యాన్ని నిర్దేశించి చక్కదిద్దే నిర్దేశకుడు చంద్రబాబు అని ఎమ్మెల్సీ శ్రీకాంత్ అన్నారు. కుప్పం పార్టీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఆయన తెలుగుయువతతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కంచర్ల మాట్లాడుతూ యువతను ఉన్నత చదువులు చదివించడంతోపాటు వారికి అవసరమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దండిగా కల్పించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. కుప్పంలాంటి వెనుకబడిన నియోజకవర్గంలో ఎన్నో విద్యా సంస్థలను తెచ్చి ఇక్కడి అక్షరాస్యతను పెంచారన్నారు. యువకులను వైసీపీ పక్కదారి పట్టించిందని, మద్యానికి, గంజాయికి మానిసలు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. యువత ఆశలు, కలలకు రెక్కలు తొడిగే బాధ్యత చంద్రబాబు తీసుకుంటారని హామీ ఇచ్చారు.

వైసీపీ నయవంచక పాలనకు ముగింపు పలకాలి

రామకుప్పం : వైసీపీ నయవంచక పాలనకు ఓటు అనే ఆయుధంతో ప్రజలు ముగింపు పలకాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, చంద్రబాబు పీఏ మనోహర్ కోరారు. శుక్రవారం వారు రామకుప్పంలోని బజారువీధి, ఆవుల కుప్పం గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేశారు. వారు మాట్లాడుతూ వైసీపీ అసమర్థ పాలనలో పేద, మధ్య తరగతి ప్రజలకు ఒరింగిందేమీ లేదన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఘనవిజయం సాధించి, చంద్రబాబు సీఎం కావడం తథ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆనందరెడ్డి, నరసింహులు, మునస్వామి, పత్రనారాయణాచారి, విశ్వనాథ్, వెంకటాచలం, రామ్మూర్తి, రామకృష్ణప్ప, మహ్మద్‌రఫీ, గజేంద్ర, సత్తి, నాగభూషణం, సలాంసాబ్, వెంకటరమణ, భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'కోడ్' మార్గదర్శకాలను అందించాలి

రామకుప్పం, మార్చి 22: ఎన్నికల కమిషన్ జారీ చేసిన మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ మార్గదర్శకాలను కుప్పం నియోజకవర్గంలోని అన్ని పార్టీల మండలాధ్యక్షులకు అందించాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అధికారులను కోరారు. శుక్రవారం రామకుప్పం బజారువీధిలో ఆయన పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటా ప్రచారం చేస్తుండగా ఎంపీడీఓ ఈశ్వరయ్య తమ బృందంలో కలిసి అక్కడకు చేరుకుని ఎన్నికల అధికారి అనుమతులు లేకుండా ప్రచార కార్యక్రమం నిర్వహించరాదని ఎమ్మెల్సీ కంచర్లకు తెలిపారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఇప్పటివరకు ఇంటింటా ప్రచారం చేసేందుకు అనుమతులు తీసుకోవాలన్న విషయం తెలియదన్నారు. ప్రచార నిర్వహణ, ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికార యంత్రాంగానికి అన్ని విధాలా సహకరిస్తామన్నారు. ఎన్నికల అధికారి అనుమతులతోనే ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎంపీడీఓకు తెలిపి ప్రచారాన్ని అర్ధాంతరంగా ముగించారు. కోడ్ మార్గదర్శకాలను తెలుగులోకి తర్జుమా చేసి అందించాలని కోరారు. స్పందించిన ఎంపీడీఓ ఈ అంశాన్ని నియోజకవర్గ ఎన్నికల అధికారి దృష్టికి తీసుకెళతామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



గంగవరం, మార్చి 22: పలమనేరు-బెంగళూరు రహదారిలో గండ్రాజుపల్లె సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో మణి అనే వ్యక్తి మృతి చెందినట్లు సీఐ చిన్నగోవిందు తెలిపారు. సీఐ కథనం మేరకు.. గంగవరం మండలంలోని గొర్రెలదొడ్డి గ్రామానికి చెందిన మణి ఇంట్లో టీవీ రిమోట్ పనిచేయకపోవడంతో కొనుగోలు చేయడానికి ద్విచక్రవాహనంలో నాలుగురోడ్ల సర్కిల్‌కు వచ్చాడు. రిమోట్ కొనుగోలు చేసి సర్వీసు రోడ్డులో వెళ్తుండగా ద్విచక్రవాహనం ఎదురుగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలవ్వగా, అందులో తీవ్రగాయాలైన మణి అక్కడికక్కడే మృతిచెందినట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డిగ్రీ కాలేజీలో శ్రమదానం



కాలేజీ ఆవరణాన్ని శుభ్రం చేస్తున్న విద్యార్థులు

పుంగనూరు రూరల్, మార్చి22: ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా శుక్రవారం పుంగపూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణలో ప్రిన్సిపాల్ రాజశేఖర్ విద్యార్థులచేత మొక్కలు నాటించి పరిసరాలు శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్నారు. వర్షపు నీటిని నిల్వ చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, విద్యార్థులు తల్లిదండ్రులకు నీటి పొదుపుపై అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ శ్రీనివాసులు, అధ్యాపకుడు రాంకుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

లాటరీ టికెట్టు విక్రేతల అరెస్ట్

పుంగనూరు రూరల్, మార్చి22: పుంగనూరులో ముగ్గురు లాటరీ టికెట్టు విక్రేతలను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు సీఐ రాఘవరెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు... పట్టణానికి చెందిన నజీర్, మురళి, వాజీద్‌లు లాటరీ టికెట్లను తూర్పుమొగసాలలో విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు వారిని అదుపులోకి తీసుకోగా రూ. 20వేలు విలువ కలిగిన టికెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గరుడ వాహనంపై విహరించిన వెంకటరమణ స్వామి



పుంగనూరు రూరల్, మార్చి 22: పుంగనూరు కోనేరు వద్ద వెలసిన కల్యాణ వెంకటరమణ స్వామి శుక్రవారం గరుడ వాహనంపై ఊరేగారు. టీటీడీ ఆధ్వర్యంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా అర్చకులు శ్రీనివాసాచార్యులు స్వామిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పల్లకిలో ఏర్పాటు చేసి మోహినీ అవతారంలో ఊరేగించగా భక్తులు మంగళహారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి తిరుపతి నుంచి తెచ్చిన గరుడ వాహనంపై ఊరేగించగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ జే.మునేంద్రబాబు, అర్చకులు పృధ్వీరాజ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి : ఆర్వో



మాట్లాడుతున్న ఆర్వో మధుసూదన్‌రెడ్డి

పుంగనూరు రూరల్, మార్చి 22: సార్వత్రిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రతి ఒక్క అధికారి సహకరించాలని పుంగనూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వై.మధుసూదన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక జడ్పీ అతిథి గృహంలో జరిగిన ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాలన్నారు. నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులుపై సమీక్షించారు. సమావేశంలో ఏఆర్వో నరసింహప్రసాద్‌రెడ్డి, తహసీల్దార్ శివయ్య తదితరులు పాల్గొన్నారు.

వైష్ణవిదేవికి ప్రత్యేక పూజలు



చౌడేపల్లె, మార్చి22: పుదిపట్లలో వెలసిన వైష్ణవి దేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ నిర్వహకులు వినోద్‌కుమార్ రెడ్డి, శ్రావణి భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కమనీయంగా శ్రీవారి కల్యాణం



సోమల, మార్చి 22: ఆవులపల్లెలో కొలువుతీరిన ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉదయం మూలవిరాట్‌కు విశేష అలంకరణలు జరిపి అభిషేకపూజలు నిర్వహించారు. పురోహితులు శాస్త్రోక్తంగా హోమాలు జరిపారు. ఉత్సవమూర్తులకు ఆలయ ప్రాకారణోత్సవం నిర్వహించారు. రాత్రి పెద్దఉప్పరపల్లె, పేటూరు, ఆవులపల్లె, అన్నెమ్మగారిపల్లె పంచాయతీల్లోని బలిజల ఆధ్వర్యంలో వేదపండితులు ఉత్సవ మూర్తులకు కల్యాణం జరిపారు. అనంతరం గరుడ వాహనంపై అలంకరించి పురవీధుల్లో కోలాటాలు, చెక్క భజనల నడుమ ఊరేగించారు.

ప్రత్యేక అలంకరణలో విరూపాక్షి మారెమ్మ



పుంగనూరు రూరల్, మార్చి22: పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి వేప, మామిడి ఆకులతో తోరణాలు కట్టి ప్రత్యేక అలంకరణ, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు ఉపవాసాలతో అమ్మవారికి చీరలు, రవికలు మొక్కులుగా చెల్లించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

ఆవులపల్లెలో ఏనుగుల దాడులు

సోమల, మార్చి 22 : ఆవులపల్లె పంచాయతీలోని పత్రపల్లె, మల్లేశ్వరం, వంగసానివారిపల్లె, ఇర్లపల్లెకు చెందిన పలువురి రైతుల పొలాలను గురువారం రాత్రి ఏనుగులు ధ్వంసం చేశాయి. రెడ్డివారిపల్లెకు చెందిన దుర్గం ఈశ్వరయ్య, బుసగాని కృష్ణప్ప, చెంగల్ రాయప్పకు చెందిన వరి పంటలతోపాటు డ్రిప్ పైపులు, విద్యుత్ మోటర్లను ధ్వంసం చేసినట్లు రైతులు వాపోయారు. టమోటా పంటలకు ఊతంగా నాటిన కర్రలను తొక్కివేయడంతో రైతులు నష్టపోయారు. అటవీ శాఖ అధికారులు స్పందించి ఏనుగుల బెడద నుంచి పంటలను కాపాడాలని కోరుతున్నారు.

కొత్తఇండ్లులో ఉచిత వైద్య శిబిరం



కుప్పం రూరల్, మార్చి 22: కుప్పం ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని కొత్తఇండ్లు గ్రామంలో ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పీఈఎస్ వైద్య కళాశాల వైద్యులు డాక్టర్ శిఖరరెడ్డి, జనరల్ మెడిసిన్ డాక్టర్ కుమార్ తేజ, డాక్టర్ తరుణ్, జనరల్ సర్జరీ డాక్టర్ అనురాగ్, ఆర్థో డాక్టర్ కృష్ణ, కొత్తఇండ్లు పీహెచ్‌సీ డాక్టర్ సుభాష్‌లు 250 రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేఈసీ ప్రిన్సిపాల్ సుధాకరబాబు, చీఫ్ లైబ్రేరియన్ శరవణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సత్యమూర్తి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మాధవన్, గంగాధరం, పీఆర్వో ప్రవీణ్ కుమార్, చందం పంచాయతీ సర్పంచి కుమారస్వామి, తిమ్మరాయస్వామి గుడి చైర్మన్ షణ్ముగం, విద్యార్థులు పాల్గొన్నారు.

మహాగణపతి ఆలయ కుంభాభిషేకం

బైరెడ్డిపల్లె, మార్చి 22 : పట్టణంలోని ఇందిరమ్మకాలనీలో నూతనంగా నిర్మించిన మహాగణపతి ఆలయ కుంభాభిషేకం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేదపండితులు శాస్త్రోక్తంగా హోమాలు, పూజలు నిర్వహించి స్వామివారి నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

లెక్కల పరీక్షకు 21 మంది గైర్హాజరు

పలమనేరు, మార్చి22 : పలమనేరు మండలంలోని 6 పరీక్షా కేంద్రాల్లో శుక్రవారం జరిగిన 10 వతరగతి పరీక్షలకు 21 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని మండల విద్యాశాఖ అధికారులు లీలారాణి, బాలసుందరం తెలిపారు. 1338 మంది విద్యార్థులు 10వ తరగతి గణితం పరీక్షలకు హాజరు కావాల్సి వుండగా 1317 మంది మాత్రమే హాజరు అయ్యారని తెలిపారు. విద్యార్థులకు తాగునీటి వసతి, మురుగుదొడ్లు, పరీక్షలు రాసేందుకు డెస్కులు ఏర్పాటు చేశామని తెలిపారు.

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయండి

కుప్పం, మార్చి 22: టీడీపీ అధినేత చంద్రబాబు ఈనెల 25, 26 తేదీల్లో కుప్పం నియోజకవర్గ పర్యటనను విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ కుట్రలను తిప్పికొట్టడానికి ఎన్నికలు జరిగేదాకా కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టీడీపీ ముస్లిం మైనారిటీ నాయకుడు సర్దార్, విశ్వ, సంతోశ్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

కల్లూరు, మార్చి 22: కల్లూరు-సదుం మార్గంలోని చిట్టారెడ్డిపేట సమీపంలో ఓ మహిళ వద్ద అక్రమంగా ఉన్న 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. అమెపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు



చౌడేపల్లె, మార్చి 22: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. వేదపండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

గజవాహనంపై కరకంఠేశ్వరుడు



నగరి, మార్చి 22: కామాక్షి సమేత కరకంఠేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న పంగుణోత్తర బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామిని గజవాహనంపై ఊరేగించారు. ఈ సందర్భంగా వేదపండితులు ఆలయంలో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు స్వామిని విశేషంగా అలంకరించి గజవాహనంపై అధిష్ఠింపజేసి, ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రింటింగ్ ప్రెస్ పాలకవర్గ పదవీ కాలం పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 22: చిత్తూరు డిస్ట్రిక్ కో-ఆపరేటివ్ ప్రింటింగ్ ప్రెస్ సెవెన్‌మెన్ కమిటీ పాలకవర్గ పదవీకాలాన్ని శనివారం నుంచి ఆరునెలల పాటు పొడిగిస్తూ సహకారశాఖ రిజిస్ట్రార్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ కమిటీ పదవీకాలం ఈనెల 23వ తేదీనుంచి 2024 సెప్టెంబరు 22వ తేదీవరకు లేదా మధ్యలో ఎన్నికలు జరిగి నూతన పాలకవర్గం ఏర్పడే వరకు కొనసాగనుంది. కమిటీ చైర్మన్‌గా జె.మురళీమోహన్, డైరెక్టర్లుగా పిరామచంద్రారెడ్డి, ఎస్.రాజారెడ్డి, ఆర్.కృష్ణమూర్తి, వి.హరిబాబు, సిరెడ్డి రాధా, ఆర్.కె.బుల్ రెడ్డి కొనసాగుతారు.

ఓటు హక్కుపై అవగాహన



ఓటు హక్కుపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

చిత్తూరు, మార్చి 22: ఎన్నికల కమిషన్, జిల్లా ఎన్నికల అధికారి, ఆర్వో ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలో విస్తృతంగా ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జానకారపల్లె, గాయత్రీనగర్, మాపాక్షి వార్డు సచివాలయాల పరిధిలో శుక్రవారం మహిళలతో రంగోలి, అవగాహన, ర్యాలీ కార్యక్రమాలను నిర్వహించారు. స్వీప్ నోడల్ అధికారి చిన్నయ్య, ఆర్‌ఓ వెంకటేశ్ పాల్గొన్నారు.

'కోడ్' ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

పూతలపట్టు, మార్చి 22: ప్రభుత్వం నుంచి జీతాలు తీసుకుంటున్న ప్రతి ఒక్కరూ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి చిన్నయ్య హెచ్చరించారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో శుక్రవారం అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, వలంటీర్లు, ఎస్‌పీ షాపు డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, ఎన్నికల డీటీలు పాల్గొన్నారు.

పెన్షనర్ల మెడికల్ బిల్లుల పరిశీలనలో ఆలస్యం

చిత్తూరు కల్చరల్, మార్చి 22: 'సిటిజన్ చార్టర్ ప్రకారం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి అధికారులు వారం రోజుల్లో పెన్షనర్ల మెడికల్ బిల్లులు పరిశీలించాలి. కానీ మూడు నుంచి ఆరు నెలల వరకు ఆలస్యం చేయడంతో విశ్రాంత ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు' అని విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కేశవులు పేర్కొన్నారు. కలెక్టర్ ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు.

15 రోజులుగా తాగునీటి సమస్య



ఖాళీ బిందెలతో మహిళల నిరసన

బంగారుపాళ్యం, మార్చి 22: మండలంలోని కాటప్పగారిపల్లెలో 15 రోజులుగా తాగునీటి సమస్య ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ.. బావుల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోందని చెప్పారు. ఇకనైనా అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరారు.

నీటిని సంరక్షించుకోవాలి

బంగారుపాళ్యం, మార్చి 22: నీటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఐసీడీఎస్ హెచ్‌ఎం వేణు రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రపంచ జలదినోత్సవాన్ని పురస్కరించుకుని బేకమంద జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించారు. ఉపాధ్యాయులు షంషీర్ ఖాన్, విజయకుమారి, దేవకి, జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి ప్రపత్తులతో భజన కార్యక్రమం

చిత్తూరు కల్చరల్, మార్చి 22: తపోవనం రాస్ సద్గురు ఆశ్రమంలో శుక్రవారం సాయంత్రం సత్సంగం భజనమండలి సభ్యుల భజన కార్యక్రమాన్ని భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. సత్సంగ్ సేవాసమితి జిల్లా అధ్యక్షుడు మధుసూదనం, నగర కన్వీనర్ పి.శేషునారాయణ, మహేష్ పాల్గొన్నారు.

రేపు సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం

గుడిపాల, మార్చి 22: కందగిరి కొండపై వెలసి ఉన్న వళ్లీ సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 9-10.30 గంటల మధ్య స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ధర్మకర్త సుబ్రహ్మణ్యం నాయుడు, పాలకవర్గ సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం గిరి ప్రదక్షిణ ఉంటుందన్నారు.

బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

నింద్ర, మార్చి 22: బాలింతలు, కిశోర బాలికలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని నగరి ప్రాజెక్ట్ సీడీపీవో కృష్ణవేణి అన్నారు. శుక్రవారం మండలంలోని కొప్పేడు, శ్రీరామపురం, కావనూరు అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార పక్షోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ శ్యామల, అంగన్వాడీ కార్యకర్తలు కాంచన, రాధిక, హేమమాలిని, శాంతి, దుర్గాదేవి, అమరావతి, కర్పగం, కన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

విజయపురం: మండలంలోని శ్రీహరిపురంలో శుక్రవారం పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. హెచ్‌ఎం సోమశేఖర్ మాట్లాడుతూ గర్భిణులు ఎక్కువగా కూరగాయలు, ఆకు కూరలు, పాలు, గుడ్లు, పండ్లు విధిగా తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్త సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంకు ఓటమి భయం

భీమనేని చిట్టిబాబు నాయుడు

పాలసముద్రం, మార్చి 22: డిప్యూటీ సీఎం నారాయణస్వామికి ఓటమి భయం పట్టుకొని ఎన్నికల ప్రచార సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు విమర్శించారు. శుక్రవారం పాలసముద్రం టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, ఇలాంటి వాటిని సహించబోమన్నారు. నారాయణస్వామి ఓడిపోతారనే ఆయన కుమార్తెకు జగన్‌మోహన్‌రెడ్డి టిక్కెట్ కేటాయించారని అన్నారు. టీడీపీ నాయకులు శేఖర్ రాజు, వెంకటేశులు నాయుడు, శీను రాజు, రవి నాయుడు, తంగరాజ్ మీడియా సమావేశంలో పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలపై ప్రచారం



వరదరాజులపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న మురళీ మోహన్

యాదమరి, మార్చి 22: చంద్రబాబు ప్రకటించిన ఆరు గ్యారెంటీలపై మహిళలు, ప్రజలకు పూతలపట్టు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ అవగాహన కల్పించారు. వరదరాజులపల్లె పంచాయతీలోని చెన్నారెడ్డిపల్లె, వరదరాజులపల్లె, పిళ్లారిమిట్ట, బుడిగిమిట్ట గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించి వైసీపీ అధికారంలోకి వచ్చాక పెరిగిన నిత్యావసర సరుకుల ధరలపై వివరించారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి యువరాజులు నాయుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, స్థానిక నాయకులు మోహన్, జగదీశ్, లాజీ, రజిని, వర్షిత్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మళ్లీ సీఎం కావాలి

జనం కోరుకుంటున్నది ఇదే
నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్



భానుప్రకాష్‌ను ఆప్యాయంగా పలుకరిస్తున్న వృద్ధురాలు

నింద్ర, మార్చి 22: 'చంద్రబాబు మళ్లీ సీఎం కావాలి. జనం కోరుకుంటున్నది ఇదే' అని నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ తెలిపారు. శుక్రవారం మేళంబాకం పంచాయతీ పరిధిలో మీకోసం మీ తెలుగుదేశం, బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భాను ప్రకాష్ మాట్లాడుతూ.. టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా పోటీచేస్తున్న తనను ఆశీర్వదించి, గెలిపించాలని కోరారు. రాష్ట్రం అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి చెందాలంటే టీడీపీతోనే సాధ్యమన్నారు. టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో ఇంటింటికీ సంక్షేమం అందుతుందని స్పష్టం చేశారు. అనంతరం పలువురు వైసీపీ నాయకులు, యువకులు భానుప్రకాష్ సమక్షంలో టీడీపీలో చేరారు. జిల్లా అధికార ప్రతినిధి దినబాబు, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, నాయకులు వెంకటపతిరాజు, జయచంద్రరాజు, బాబురాజు, మోహన్‌రాజు, జయచంద్ర, నాగభూషణం, ఓం ప్రకాష్, విజయ్ భాస్కర్, జయకుమార్, భాస్కర్‌రాజు, గాలి రమేష్ నాయుడు, చిట్టిబాబు, లోకనాథం, అయ్యప్ప, అపరంజి, విజయ్, వెంకటేష్, జనసేన నాయకులు మెరుపుల మహేష్, బంగి శివలింగం, రాధ, జయప్రకాష్ పాల్గొన్నారు.

టీడీపీ నేతలకు సన్మానం



గురజాల జగన్మోహన్, సందీప్‌ను సన్మానిస్తున్న శివకుమార్

చిత్తూరు సిటీ, మార్చి 22: టీడీపీ నేతలను 26వ డివిజన్ కార్పొరేటర్ కె.శివకుమార్ సన్మానించారు. శుక్రవారం నగరంలోని బీవీ రెడ్డి కాలనీలోని జీజేఎం కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గురజాల సందీప్, చిత్తూరు నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్‌ను సన్మానించారు. శివకుమార్ తన డివిజన్‌లోని అనుచరులతో వచ్చి గురజాలకు మద్దతు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో గురజాల గెలుపునకు శక్తివంచన లేకుండా కృషిచేస్తానని చెప్పారు.

సేవ చేయడానికే వచ్చాం

గుడిపాల: 'సేవ చేయడానికే వచ్చామని జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకుడు, టీడీపీ సీనియర్ నాయకుడు గురజాల చెన్నకేశవులు నాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు అన్నారు. శుక్రవారం వసంతాపురం గ్రామంలో టీడీపీ తరఫున ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. మాజీ సర్పంచ్ ప్రతాప్ నాయుడు, నాయకులు శంకర్ చౌదరి, ఆనంద్ యాదవ్, మనోహర్, బాబురెడ్డి, మధుసూదన్ నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి గెలుపు రాష్ట్రానికి అవసరం

చిత్తూరు రూరల్: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గెలుపు రాష్ట్రానికి ఎంతో అవసరమని చిత్తూరు అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి గురజాల జగన్మోహన్ నవీమణి ప్రథమ అన్నారు. శుక్రవారం చిత్తూరు రూరల్ మండలంలోని బీఎన్‌ఆర్‌పేట గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు మోహన్‌రాజ్, శేఖర్‌బాబు, మనోహర్ నాయుడు, చిట్టిబాబు, భాను, ఆనంద నాయుడు, ఉస్మాన్, జాఫర్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని డ్రగ్స్ క్యాపిటల్‌గా మార్చిన సీఎం

గురజాల జగన్మోహన్

చిత్తూరు సిటీ, మార్చి 22: ఏపీని డ్రగ్స్ క్యాపిటల్‌గా సీఎం జగన్ మార్చారని చిత్తూరు నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలో డ్రగ్స్‌తో పట్టుబడిన కంటైనర్‌కు చెందిన వీరభద్రరావు సోదరుడు కూనం పూర్ణచంద్రరావు ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు వైసీపీ నేత అన్నారు. ఇతనికి విజయసాయి రెడ్డితో సన్నిహిత సంబంధాలున్నాయని పేర్కొన్నారు. సీబీఐ నివేదిక చూస్తుంటే దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా దాని మూలాలు ఏపీలోనే ఉన్నాయని స్పష్టమవుతోందన్నారు. డ్రగ్స్ కుంభకోణంలో తాడేపల్లి ప్యాలెస్ హస్తం ఉందని, అందుకే వైసీపీ నేతలు తీవ్రంగా స్పందిస్తున్నారని ఆ ప్రకటనలో తెలియజేశారు.

జీడీనెల్లూరులో మహిళా ఓటర్లే అధికం



మొత్తం ఓటర్లు: 204669
పోలింగ్ కేంద్రాల సంఖ్య: 255
పురుషుల ఓటర్ల సంఖ్య:101697
మహిళా ఓటర్లు: 102966
ట్రాన్స్‌జెండర్: 6

వెదురుకుప్పం, మార్చి 22: గంగాధరనెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఎస్సీ రిజర్వు కేటాయించారు. ఈ నియోజకవర్గ పరిధిలో వెదురుకుప్పం, ఎస్‌ఆర్‌పురం, పాలసముద్రం, గంగాధరనెల్లూరు, పెనుమూరు, కార్వేటినగరం మండలాలు ఉన్నాయి. 255 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ ఈనెల 17వ తేదీ ఓటర్ల జాబితా ప్రకారం 204669 మంది ఓటర్లున్నారు. వీరిలో పురుషులు 101697 ఉండగా, మహిళలు 102966 మంది ఉన్నారు. అంటే ఈ నియోజకవర్గ పరిధిలో మహిళా ఓటర్లు 1269 మంది అధికం. ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఆరు మంది ఉన్నారు. కాగా, సర్వీసు ఓటర్లు 475 మంది, పీడబ్ల్యూడీ ఓటర్లు 3583 మంది, 18 నుంచి 19 ఏళ్ల మధ్య ఉన్న ఓటర్లు 4641 మంది, సీనియర్ సిటిజన్లు 2763 మంది ఉన్నారు.

4641 మందికి తొలిసారిగా ఓటు హక్కు

ఇప్పటి వరకు 4641 మంది తొలిసారి తమ ఓటు హక్కును వినియోగించుకునేలా కల్పించారు. వీరంతా 18-19 ఏళ్ల మధ్య ఉన్నవారు.

మండలాల వారీగా పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలు

- పెనుమూరు మండలంలో 42 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఓటర్లు 32500 మంది. వీరిలో.. పురుషులు-16176, మహిళలు-16323 మంది, ట్రాన్స్ జెండర్ ఒకరు ఉన్నారు. ఇక్కడా 147 మంది మహిళా ఓటర్లే ఎక్కువ.
- వెదురుకుప్పం మండలంలో 41 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 36131 మంది ఓటర్లున్నారు. వీరిలో.. పురుషులు-18132 మంది, మహిళలు-17996 మంది ఓటర్లు ఉన్నారు. ట్రాన్స్‌జెండర్-3 ఓట్లు ఉన్నాయి. ఈ మండలంలో 136 ఓట్లు పురుషులవే అధికంగా ఉన్నాయి.
- కార్వేటినగరం మండలంలో 50 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 35084 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో.. 17250 మంది పురుషులు, 17834 మంది మహిళలు ఉన్నారు. ఇక్కడా 584 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు.
- ఎస్‌ఆర్‌పురం మండలంలో 35 పోలింగ్ కేంద్రాలున్నాయి. 29241 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 14477 మంది పురుషులు, 14763 మంది మహిళలున్నారు. ఒక ట్రాన్స్‌జెండర్ ఓటు ఉంది. 286 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు.
- గంగాధరనెల్లూరు మండలంలో 64 పోలింగ్ కేంద్రాలు ఉండగా 53891 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 26861 మంది పురుషులు, 27029 మంది మహిళలు ఉన్నారు. ఒక ట్రాన్స్‌జెండర్ ఓటు ఉంది. మహిళా ఓటర్లు-168 మంది ఎక్కువగా ఉన్నారు.
- పాలసముద్రం మండలంలో 23 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. 17822 ఓట్లు ఉన్నాయి. వీరిలో 8801 మంది పురుషులు, 9021 మంది మహిళలు ఉన్నారు. ఈ మండలంలోనూ 220 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు.

టీడీపీ హయాంలోనే గ్రామీణాభివృద్ధి



బూచివానత్తంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

విజయపురం, మార్చి 22: టీడీపీ హయాంలోనే గ్రామీణాభివృద్ధి జరిగిందని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మున్నా ధనుంజయయాదవ్ అన్నారు. బాబు సూపర్ సిక్స్ కరపత్రాలను బూచివానత్తం, జీఎంపురం పంచాయతీల్లో ఇంటింటా పంపిణీ చేశారు. వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమని చెప్పారు. మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, తెలుగు మహిళా అధ్యక్షురాలు గుణభూషణమ్మ, నాయకులు బాలసుబ్రహ్మణ్యంరాజు, దశరథరాజు, సుధాకర్‌రాజు, మురళి, మహేంద్ర, బీలీనాయుడు, బాలాజీనాయుడు, వాసునాయుడు, బాబినాయుడు, శివయ్యనాయుడు, గుణశేఖర్‌రెడ్డి, శరత్, కపిల్, బెంజిమాన్ తదితరులు పాల్గొన్నారు.

నేమ్‌బోర్డులో పేరు మార్చరా?



గుడిపాల, మార్చి 22: తహసీల్దారు కార్యాలయం వద్ద ఉన్న నేమ్ బోర్డులో అనంతపురానికి బదిలీ అయిన తహసీల్దారు బాబు రాజేంద్రప్రసాద్ పేరును ఇంకా మార్చలేదు. ప్రస్తుతం తహసీల్దారుగా విజయలక్ష్మి బాధ్యతలు నిర్వహిస్తుండటంతో జనం కొంత గందరగోళానికి గురవుతున్నారు.

వేము కళాశాలలో 'ప్రజ్ఞ' ప్రారంభం



విద్యార్థులు రూపొందించిన టెక్నాలజీ బుక్‌ను ఆవిష్కరిస్తున్న చంద్రశేఖర్ నాయుడు

పూతలపట్టు, మార్చి 22: వేము ఇంజనీరింగ్ కళాశాల ఆవరణంలో ప్రజ్ఞ-2024 కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ చంద్రశేఖర్ నాయుడు మాట్లాడుతూ.. విద్యార్థులు టెక్నాలజీలోనూ ముందుండాలని సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయడంలో ప్రజ్ఞ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి 50 టీములు పాల్గొన్నాయన్నారు. విద్యార్థులు రూపొందించే టెక్నాలజీ సమాజానికి ఉపయోగపడేవిధంగా ఉండాలన్నారు. సైంటిస్ట్ భవానీకుమార్ మాట్లాడుతూ.. ఈ కళాశాల త్వరలోనే యూనివర్శిటీగా మారడం ఖాయమన్నారు. డాక్టర్ మల్లికార్జున్, నవీన్ కిల్లారి, డాక్టర్ ప్రకాష్, లెక్చరర్లు, పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కాగా, సాయంత్రం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



విద్యార్థినుల సందడి

ప్రాణాలు పోతే వీఆర్‌కు పంపిస్తారా?

రైతు మరణానికి కారణమైన ఎస్‌ఐ, పోలీసులను సస్పెండ్ చేయాలి: సీపీఐ



నాగరాజు

చిత్తూరు రూరల్, మార్చి 22: వెదురుకుప్పం మండలంలోని మత్తిమాకులకండ్రిగకు చెందిన రైతు చంద్రశేఖర్ మృతికి కారణమైన వెదురుకుప్పం ఎస్‌ఐని సస్పెండ్ చేయకుండా వీఆర్‌కు పంపించడం సరికాదని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు విమర్శించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పోలీసులకు సంబంధం లేని విషయంలో జోక్యం చేసుకుని ఓ ప్రాణాన్ని బలిగొంటే దీనికి సంబంధం ఉన్న కానిస్టేబుల్, హోంగార్డులు బయట దర్జాగా తిరుగుతున్నారని వాపోయారు. రైతు మరణానికి కారకులైన వారిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం: టీడీపీ



బాధితులతో మాట్లాడుతున్న కిషన్‌చంద్

వెదురుకుప్పం, మార్చి 22: 'మత్తిమాకులకండ్రిగలో చంద్రశేఖర్ ఆత్మహత్యకు కారకులైన వారికి శిక్షపడేలా చేస్తాం. అలాగే బాధిత కుటుంబానికి అండగా ఉంటాం' అని టీడీపీ ఎస్‌ఆర్‌పురం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గురుసాల కిషన్‌చంద్ తెలిపారు. శుక్రవారం మత్తిమాకుల కండ్రిగకు చేరుకుని చంద్రశేఖర్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.50వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు బట్టే చాణిక్యప్రతాప్, నాయకులు సురేష్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్ల నూతన కమిటీ ఎన్నిక



సమావేశంలో ప్రసంగిస్తున్న ఉమామహేశ్వరరావు

చిత్తూరు రూరల్, మార్చి 22: ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ చిత్తూరు నూతన కమిటీని శుక్రవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా గంగరాజు, అధ్యక్షుడిగా గణపతి, ప్రధాన కార్యదర్శిగా విజయకుమార్, గౌరవ సలహాదారులుగా నాగరాజు, నాగేశ్వరరావు, యేసుపాదం ఎన్నికయ్యారు. కార్యనిర్వాహక అధ్యక్షులుగా లోకనాథం, బాబు, దొరస్వామి, ఉపాధ్యక్షులుగా వరలక్ష్మి, వడివేలు, నరసమ్మ, కార్యదర్శులుగా రాజీ, వెంకటేష్, రాజా, కోశాధికారులుగా ఇసాక్, రాజ్యలక్ష్మి ఎన్నికయ్యారు.

అశ్వవాహనంపై అగస్త్యేశ్వరుడి విహారం



అశ్వవాహన సేవలో బలిజ సేవా సంఘం ప్రతినిధులు

చిత్తూరు కల్చరల్, మార్చి 22: కామాక్షి అంబికా సమేత అగస్త్యేశ్వర ఆలయ పంగుణి మాస బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం నగర హలంతెట్టి, రమాదేవి కుటుంబ సభ్యుల ఉభయంతో ఆలయ అర్చకుడు శివాచార్య బృందం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం, పూజలు చేశారు. అనంతరం విశేష ఉత్సవం, కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవర్లను అశ్వవాహనంపై ఉంచి ఊరేగించారు. ఉభయదారులైన జిల్లా బలిజసేవా సంఘం ప్రతినిధులు మాజీ మేయర్ కఠారి హేమలత, పూల సుబ్రహ్మణ్యం నాయుడు, వి.జె.విశ్వనాథ్, ఓం.ఎం.రాందాస్, పోతుల రామ్మూర్తి, ఆలయ ఈవో తిమ్మారెడ్డి, ఉత్సవ నిర్వాహకుడు శివప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.



చిత్తూరులో..



గుండ్రాజుకుప్పంలో..

సాయుధ బలగాల కవాతు

చిత్తూరు, మార్చి 22: ఎస్పీ జాషువా ఆదేశాల మేరకు శుక్రవారం రెండో పట్టణ పోలీసు స్టేషన్‌పరిధిలో సీఐ ఉలసయ్య ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నగరి: గుండ్రాజుకుప్పం, గుండ్రాజుకుప్పం దళితవాడ, నగరి పట్టణ పరిధిలోని ఏకాంబరకుప్పం, కేవీపీఆర్ పేట, దెరణిలో శుక్రవారం సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగరి సీఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను మేనిఫెస్టోలో పెట్టాలి: ఏఐటీయూసీ

నగరి, మార్చి 22: ఆశ, అంగన్‌వాడీ మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో పెట్టాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి కోదండయ్య కోరారు. నగరి పట్టణ పరిధిలోని సీపీఐ కార్యాలయ ఆవరణలో శుక్రవారం జరిగిన ఏఐటీయూసీ అనుబంధ సంఘాల సమావేశంలో ఆయన ప్రసంగించారు. పట్టణ నాయకులు మురళి, రాజేంద్రన్, సతీష్, చందమన్ణి, నరేష్, ఉషారాణి, దశరథ, రాము, రాజేశ్వరమ్మ, పార్వతి పాల్గొన్నారు.